నేను హాస్పిటల్ నుంచి ఇంటికొచ్చేసరికి మా చిన్నబ్బాయి భరత్‌రాజా 'పోగో చానెల్లో మిస్టర్ బీన్' చూస్తున్నాడు. నన్ను చూసి టి.వి. ఆపేసి బెడ్‌రూంలోనికెళ్లిపోయాడు. మామూలుగా నేను వచ్చే టయానికి స్కూలు నుంచి పిల్లలు ఇంటికి రారు.

'స్కూలుకెళ్లలేదా? ఏమైంది వీడికి?' అడిగాను శ్రీమతిని.

'కడుపునొప్పని వెళ్లనన్నాడు' చెప్పింది.

'మరి సుబ్బరంగా టి.వి. చూస్తూ కూర్చున్నాడుగా' అన్నాను.

'ఏమో మందు వేస్తానంటే కొంచెం తగ్గిందిలే మమ్మీ వద్దులే' అన్నాడు. చెప్పింది శ్రీమతి.

నేను నా పేషంట్లని చూడ్డానికి కన్సల్టేషన్ రూంలోకి వెళ్లబోతుంటే-

'పెషెంట్లయితే పడిపడి చూస్తారు, ఇంట్లో వారిని పట్టించుకోరని' నిష్టూరంగా మాట్లాడింది శ్రీమతి.

బెడ్‌రూంలోనికెళ్తే దుప్పటి కప్పుకుని అటు తిరిగి పడుకున్నాడు.

'ఏమైందిరా?' ఇటు తిరుగు చూస్తానంటు' షర్టు పైకి లేపి పొట్ట వత్తి చూశా! మెత్తగా వుంది. అంతా నార్మల్.

'హోం వర్కు చెయ్యలేదా?' అడిగాను మళ్ళీ.

"కాదు డాడీ! ఈరోజు మేథ్స్ టీచర్ ఫిఫ్టీన్ టేబుల్స్ వరకు చదువుకురమ్మంది, రాకపోతే స్కేలు విరిగేలా కొడుతుంది!, అందుకే కడుపునొప్పని మమ్మీతో అబద్ధం చెప్పి స్కూలు మానేశా! సారీ డాడీ" అంటూ ఏడుస్తూ చెయ్యి పట్టుకున్నాడు.

వాడు ఏడుస్తుంటే నాకు జాలేసింది. హైస్కూల్లో ఆరోతరగతి చదివేరోజులు గుర్తొచ్చాయి నాకు.

** ** **

# గిల్టీ

డాక్టర్ యస్.వి.రామరాజు



ఐదో తరగతి పాసైన మా ఐదుగురిని ఊర్లోని అప్పర్ ప్రైమరీ హైస్కూల్లో చేర్చాడు కట్టిపల్లి కోటయ్య మాష్టారు. కూడికలు, తీసివేతలు, భాగహారాలు పదివరకు ఎక్కాలు, తెలుగులో చదవడం రాయడం, ఇంగ్లీషులో ఏ,బి,సి,డీలు తప్ప మాకేమీ రావు.

హైస్కూలు చదువుకి మా బడిలో చెప్పిన చదువుకి సంబంధం లేదనిపించింది మాకు. హైస్కూల్లో ఏకంగా ఇంగ్లీషులో పాఠాలు, హిందీలో పాఠాలు, టెక్స్ట్ బుక్స్‌లోని పెద్ద పెద్ద లెక్కలు చెప్పసాగారు. టీచర్లు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక మా వీపులు విమానం మోత మోగుతున్నాయి.

బడి తెరిచిన మూడు నెలలకే సుబ్బారావు, ఎంకటేసు, మట్టోడు మానేశారు. ఇక మిగిలింది నేను, బంగారయ్య.

బడి మానేస్తే ఇంట్లో తంతారని, గొడ్లు కాచుకు రమ్మంటారని నేను మానకపోతే- బంగారయ్యేమో పాపం వాడి అమ్మమ్మ దేశమ్మకోసం బడి మానలేదు. వాడు పుట్టంగానే నాన్న పాము కరిచి చచ్చి పోయేడంట! వాడికి ఐదారేళ్ళు వచ్చేసరికి అమ్మ చచ్చిపోయిందంట! వాడిని అమ్మమ్మ పెంచి చదివిస్తుంది కూలీపనులు చేసి... అంతగా కష్టపడుతున్న ఆమెను బాధపెట్టటం ఇష్టంలేక వాడు స్కూలు మానలేదు.


ఎప్పటిలాగే ఇంట్లో నాయనమ్మకి చెప్పి ఒంటేలు బెల్లులో కొనుక్కోవడానికి పదిపైసలు తీసుకుని బడికి బయలుదేరి బంగారయ్య ఇంటికి వెళ్ళాను. వాడు తయారుగా లేడు. అప్పుడే అన్నం తింటున్నాడు. 'ఇంకా కాలేదా? తొరగా కానీయ్ బడికి ఆలస్యమౌతుందన్నాను'.

"నువ్వు లెక్కల హోంవర్కు చేశావా?" అన్నాడు ముద్దమింగి బంగారయ్య.

నా నెత్తిమీద పిడుగుపడ్డట్టయింది

'అవును రేయ్ మరిచిపోయా' అన్నాను భయంగా.

"5వ అధ్యాయంలో ఆరు లెక్కలు ఇచ్చాడుగా కనకగాల నరశింహారావు మాస్టారు, చెయ్యకపోతే అరడజను బెత్తాలు మన వీపులమీద విరుగుతాయి, మర్చిపోయావా" అన్నాడు కంచంలో మజ్జిగ పోసుకుంటూ బంగారయ్య.



కథ

**నాకెందుకో భయంతో ఏడుపొచ్చింది. ఆ తప్పు చేసినందుకు చచ్చిపోతే బాగుండుననిపించింది. నేను చచ్చిపోతే మా అమ్మ, నాన్న, నాయనమ్మ, అన్నయ్యలు, అక్కలెట్లా ఏడుస్తారో గుర్తొచ్చి ఇంకా ఏడుపొచ్చింది. ఆపుకుందామన్నా ఆగడం లేదు. కంట్లోనుంచి ఏకధాటిగా నీళ్ళు కారసాగాయి. ఎక్కిళ్లుగా మొదలైన ఏడుపు ఒక్కసారిగా పెద్దగా గొళ్ళుమన్నాను.**



"ఆ సంగతి మర్చిపోయా! ఇప్పుడెలాగురా. ముందుగా వెళ్లినా రంగారావు దాంట్లోనో, పోతురాజు దాంట్లోనో చూసి రాసుకునే పని, రెండో పిరీడే లెక్కలు ఇప్పుడెట్టారా?" అన్నాను భయంగా.

"భయపడకు నేనూ చెయ్యలేదులే" అన్నాడు కంచంలో చెయ్యి కడిగేసుకుంటూ.

"నువ్వు చెయ్యకపోతే నన్ను వదుల్తాడా? ఇద్దరిని కలిపి బాదుతాడు కదరా? అసలే మనకేమీ రావని ప్రతి ప్రశ్న మనల్నే అడుగుతాడు, ఇప్పుడాయన క్లాసుకు రాగానే హోంవర్కు ఎవ్వరు చేసినా చెయ్యకపోయినా ముందుగా లేపేది మనల్నే, ఏదో ఉపాయం ఆలోచించరా?" అన్నాను బంగారయ్యతో.

అప్పటికే బంగారయ్య అమ్మమ్మ దేశమ్మ పెద్దారం పొలం వరినాట్లకు వెళ్లిపోయింది. ఇంట్లో ఎవ్వరూ లేరు.

"మం స్కూలు కెళ్తే హోంవర్కు చెయ్యలేదని గ్యారంటీగా కొడతాడు కదూ?" అన్నాడు బంగారయ్య.

'అవున్రా'! అన్నాను కంగారుగా.

'నిన్ను ఈరోజు కొట్టకుండా చూస్తాలే' అన్నాడు.

'ఎలారా?' అన్నాను ఆశగా.

"మనం బడికి పోతేనే కదరా మాష్టారు కొట్టేది కాబట్టి మనం ఈ రోజు బడి ఎగ్గొడదాం" అన్నాడు ఏ కంగారు లేకుండా బంగారయ్య కంచం కడిగిన నీళ్ళు బయట పారబోస్తూ.

పక్కన పేటేరు టపాకాయ పేలినంత భయమేసింది నాకు.

'అమ్మో బడి ఎగ్గొట్టటమే? ఇంకేమన్నా వుందా? మా నాయనమ్మకు తెలిస్తే నాతోలు వలిసేస్తదిరోయ్'! అంటూ భయంతో వణికిపోయాను.

'మీ నాయనమ్మకి, నాన్నకి తెలీకుండా ఒక ఉపాయం ఆలోచించా లేరా'! అన్నాడు.

'ఏందిరా అది?' అడిగాను భయంగానే.

'ఏంలేదు- మనం బడికిపోకుండా ఇంట్లోనే వుందాం. మధ్యాహ్నం అన్నానికి బడి వదిలే టయానికి, నువ్వు ఇంటికిపోదువుగానీ, ఏమీ ఎరగనట్టు అన్నం తిని మధ్యాహ్నం పూట బడికి పోదాం, పొద్దున్న లెక్కల పిరీడ్ తప్పించుకుంటాం కాబట్టి దెబ్బలు తప్పుతాయి' అన్నాడు.

ఈ ఉపాయమేదో బాగానే ఉన్నట్టనిపించింది గానీ లోలోన నాకు భయంగానే వుంది.

నన్ను ఇంటిలోపలకు తీసుకెళ్లి లోపలినుంచే తడికకు బయట గడిపెట్టాడు బంగారయ్య.

ఇంటిలోపల కూర్చున్నామే గానీ ఏమి మాట్లాడుకోవాలన్నా భయంగా వుంది. మా మాటలు విని ఎవరన్నా వచ్చి తడిక తీసి లోపలికొచ్చి చూస్తారన్న భయంతో అట్టాగే కూర్చున్నాం మౌనంగా.

బయట ఎవరో మాట్లాడుకుంటున్నారు. వారిమాటలు మాకు స్పష్టంగా విన్పిస్తున్నాయి. కొంచెం సేపయిన తర్వాత మాటలు ఆగిపోయినయి.

వారు మాట్లాడుకునేది మా గురించి కాదు కాబట్టి మాకు భయం వెయ్యలేదు.

'ఇపుడు హెడ్మాష్టారి తెలుగు పిరీడ్ అయిపోయి వుంటుంది కదరా?" అన్నాను మెల్లగా బంగారయ్యకు వినబడేలా.

'ష్'! మాట్లాడకు బయట ఎవరైనా వింటారంటూ చూపుడివేలితోనే సైగ చేశాడు.

టైమెంతయిందో తెలీదు. ఖాళీగా ఏమీ మాట్లాడుకోకుండా కూర్చోవడం చాలా బోరుగా వుంది. కడుపునొప్పిగా వుంది. ఒంటేలు వస్తున్నట్టుగా వుంది గానీ- అదికాదులే అని సర్దిచెప్పుకున్నాను. ఇంకొంచెంసేపటికి గొంతులో దురదగా వున్నట్టుండి దగ్గు వచ్చేలా వుంది. కొంచెంసేపు బిగపట్టుకుంటే దగ్గు ఆగిపోయింది.

కొంచెంసేపటికి ముక్కు చివర దురదగా వున్నట్టనిపిం చింది. గోక్కుంటే తుమ్ము వచ్చేలా వుంది. అంటీ అంట నట్టు గోక్కున్నాను. అయినా దురద తగ్గలేదు. అదింకా పెరుగుతూనే వుంది. నాకు తెలీకుండానే పరపరా గోక్కు న్నాను. అంతే "హాచ్!...హాచ్"! అని రెండు తుమ్ములొచ్చాయి.

బంగారయ్య నావంక కోపంగా చూశాడు! బయట ఎవరన్నా వింటే ఏమన్నా వుందా?' అన్నట్టుగా.

'సరేలేరా ఇంక తుమ్మనులే' అన్నట్టు తలూపాను.

కడుపు నొప్పి పెరగసాగింది.

'ఇపుడు ఒంటేలు బెల్లు కొడతారు కదరా?' అన్నాను మెల్లగా.

"ఊ" అన్నాడు వినబడి వినబడనట్టుగా.

'మరి నాకు ఒంటేలు వస్తున్నాయి ఎలారా?' అన్నాను.

'ఆపుకో ఇంకొంచెంసేపయితే బడి అయిపొద్ది అపుడు ఇంటికెళ్ళేటప్పుడు పోసుకుందువులే' అన్నాడు.

'సరేలే'! అన్నాను గానీ- పొత్తికడుపు నొప్పిగానే వుంది. నాకు దేనిమీదకు ఆలోచన పోవడం లేదు. ధ్యాసంతా పొత్తికడుపుమీదే వుంది. దాన్ని మర్చి పోదామని-

'లెక్కల పిరీడ్ అయిపోయి వుంటుందా?' అన్నాను మెల్లగా.





'ఆఁ! ఎప్పుడో! ఇపుడు సోషల్ పీరియడ్ జరుగుతూ వుండొచ్చు' అన్నాడు.

ఎంత మందిని బాదాడో ఎన్ని బెత్తాలు ఇరగ్గొట్టాడో ఆ కనగాల మాష్టారు అన్నాడు మెల్లగా బంగారయ్య వాడు మెల్లగా చెప్పి నా పెద్దగా చెప్పినట్టు వినిపించింది నాకు.

"మాచర్ల రంగారావుని, సాంబశివరావుని ఇరగ్గొట్టుంటాడు కదరా? బట్టు ఆదిశేషగిరి రావుని మాత్రం గ్యారంటీగా కొట్టడురా ఎందు కంటే వాడు అన్ని లెక్కలు చేసివుంటాడు" అన్నాను.

"చేత్తాడు, ఎందుకు చెయ్యడురా ఒకటో తర గతి నుంచి వాడు ఆ బళ్ళోనే చదువుకున్నాడు గాబట్టి అన్నీ నేర్చుకున్నాడు. మనకెవరు నేర్పి చ్చారు?లెక్కలంటే కూడికలు, తీసేతలు, భాగా హారాలు వస్తే సాల్లేరా అన్నాడు కట్టిపిల్లి కోట య్య పంతులు. మరిప్పుడు చూడు పుస్తకా ల్లోని లెక్కలు చెబుతున్నారు మనమెప్పు డన్నా చేశామా"? అన్నాడు బంగారయ్య కోపంగా.

"బడికి పోకపోతే ఇంట్లో తంతారు, బడికెళ్తే సరిగ్గా చదవడంలేదని పంతుళ్ళు తంతున్నారు, అన్నాను నేను పెద్దగానే.

మాకు తెలీకుండానే పెద్దపెద్దగా మాట్లాడుకోసాగాం పొత్తికడుపులో నొప్పి పెరగసాగింది. "ఇంక ఆపుకోలేనురా బయటికెల్లి ఒంటేలు పోసు కుని మళ్ళీ వస్తా, లే తడిక తియ్యరా" అన్నాను బతిమాలుతున్నట్టుగా.

"నిన్నెవరన్నా బయట చూస్తే ఎట్టారా? బడికెల్లకుండా ఇక్కడేం చేస్తున్నారని- మీ నానమ్మతో చెప్పి మనిద్దర్ని తన్నిస్తారని" భయ పెట్టాడు బంగారయ్య.

నా ఆలోచలన్నీ బడిమీద, మా నాయనమ్మ మీదే వున్నాయి. బడికి పోకుండా బంగారయ్య ఇంట్లో దొంగతనంగా దాక్కుని మధ్యా హ్నం అన్నం టయానికి ఇంటికెల్లిన తర్వాత- ఒకవేళ మా నాయ నమ్మకి తెలిస్తే, మా నాన్నకు తెలిస్తే ఇంకేమన్నా వుందా? చెమడాలు వలిసేస్తాడు.

నాకెందుకో భయంతో ఏడుపొచ్చింది. ఆ తప్పు చేసినందుకు చచ్చి పోతే బాగుండునిపించింది. నేను చచ్చిపోతే మా అమ్మ, నాన్న, నాయనమ్మ, అన్నయ్యలు, అక్కలెట్లా ఏడుస్తారో గుర్తొచ్చి ఇంకా ఏడు పొచ్చింది. ఆపుకుందామన్నా ఆగడం లేదు. కంట్లోనుంచి ఏకధాటిగా నీళ్ళు కారసాగాయి. ఎక్కిళ్ళగా మొదలైన ఏడుపు ఒక్కసారిగా పెద్దగా గొళ్ళుమన్నాను.

నా ఏడువు చూసి బంగారయ్య భయపడిపోయాడు.

'ఏమైందిరా? ఆకలిగా వుందా కుండ లో అన్నం వుంది సట్టిలో చేపలకూర వుంది తిను" అంటూ బుజ్జగించాడు. వాడు బతిమాలుతుంటే నా ఏడుపు ఇంకా పెరిగింది. బయట ఎవరన్నా వింటారన్న ధ్యాసే లేదు. "ఊరుకోరా! ఊరుకో మధ్యాహ్నం బడికి పోదాంలే'! అంటూ సము దాయించసాగాడు బంగారయ్య.

'ఇపుడిపుడే ఇంటికెల్లి మా నానమ్మతో చెబితే గానీ నా ఏడుపు ఆగదురా అంటూ బోరుమని మళ్ళీ కొంచెంసేపు ఏడ్చాను.

మా నానమ్మతో చెబుతానంటే వాడికి ఎక్కడలేని భయమేసి నట్టుంది-

"మీ నానమ్మతో చెప్పొద్దురా, మా అమ్మ మ్మతో చెప్పి నన్ను కొట్టిచ్చుద్దురా ఊరుకోరా నాకూ భయంగానే వుందంటూ"వాడూ ఏడుపు లంకించుకున్నాడు. మేమిద్దరం కొంచెంసేపు ఏడ్చిన తర్వాత ఏడుపు దానంతట అదే ఆగి పోయింది. ఎక్కిళ్ళు ఆగలేదు.

'టైమెంతయి వుంటుందిరా?' అడిగాడు బంగారయ్య.

'టైమెంతయినా సరే! నేనింటికి పోతారా' అని పుస్తకాల సంచిని భుజాన తగిలించుకుని లేచాను.

'ఉండరా బయట ఎవరన్నా ఉన్నారో లేదో చూసొస్తా' నంటూ ఇంటి బయటికెళ్ళి చూసొ చ్చాడు.

"ఎవ్వరూ లేరులే! ఇంటివెనక నుంచెళ్ళి రోడ్డెక్కి, ఇంటికెళ్ళు- ఈ సంగతి ఎవ్వరికీ చెప్పొద్దు ఒట్టు" అంటూ చేతిలో చెయ్యి వేయించు కున్నాడు బంగారయ్య.

అవేమీ పట్టించుకోకుండా ఎప్పుడు పోయి నాయనమ్మని చూద్దా మా అన్న ధ్యాసలో ఒక్క పరుగుతో ఇంటికొచ్చి పడ్డాను.

మా నాయనమ్మ, గుడ్డి అచ్చమ్మ వసారాలో పిండి విసురుతున్నా రు. 'సాంబశివుడా నీదు మహిమంటూ' పాడుతుంది అచ్చమ్మ. అరుగువైపు పుస్తకాల సంచి విసిరేసి, వాళ్ళు చూడకుండా ఇంటి వెన క్కెళ్ళి గాబులో నీళ్ళతో కాళ్ళు, చేతులు సుబ్బరంగా కడుకున్నాను. వంగినప్పుడు పొత్తికడుపు నొప్పి అనిపిస్తే అపుడు గుర్తొచ్చింది పొద్దుటినుంచి ఒంటేలు పోసుకోలేదని. ఎంతసేపు పోసుకున్నానో నాకే గుర్తు లేదు- నా సంచి చూసినట్టుంది మా నానమ్మ-

ఆమె పిలుపుకి ఇంట్లోకొచ్చిపడ్డాను. ప్రతిరోజూ అన్నందగ్గర పేచీ పెట్టుకునే నేను ఏమీ మాట్లాడకుండా తల వంచుకుని తిన్నాను.

పుస్తకాల సంచి తగిలించుకుని బడికి బయలుదేరబోతుంటే మా నాన్న పిలుపు విని వెనక్కి తిరిగా భయం భయంగా.

"పెద్ద బజార్లో ఏళ్ళ ఎంకటనారాయణ కొట్లో వెచ్చాలు కొనిపెడతా బడి అయిపోయిన తర్వాత ఇంటికొచ్చేటప్పుడు తీసుకురా- నేను రేపల్లె వెళ్ళివస్తా" అని చెప్పి తనతో బజారుకు తీసుకెళ్లాడు నాన్న.

భయం భయంగా ఆయన వెంటే నడవసాగాను, వెనకగా అపుడే మధ్యాహ్నం పూట బడికి పిల్లలంతా వెళ్ళసాగారు.

'మా క్లాసుమేట్లు ఎవ్వరూ కనబడకుండా చెయ్యి దేముడా' అని మనసులో దేవుడికి వెయ్యి దండాలు పెట్టుకున్నాను.

మాచర్ల సీతారామయ్య కిళ్ళీకొట్టు దగ్గరకెళ్ళగానే చింతకింద సాంబశివరావు నన్ను చూసి-

"పొద్దున్న బడికి రాలేదేరా?" లెక్కల మాష్టారు ఈరోజు రాలే దంటూ" ఏదేదో చెప్పసాగాడు.

గిర్రున నా బుర్ర తిరిగిపోయింది. ఆ మాటలు విన్న నాన్న నా వంక చూసిన చూపు నేనెప్పటికి మరచిపోలేను. నన్నేమీ అన లేదు. కొట్టలేదు, తిట్టలేదు.

ఆ రాత్రి రేపల్లె నుంచి తిరిగొస్తూ నా కోసం భట్టిప్రోలు రెడ్డియ్య హోటల్ నుంచి నాకిష్టమైన పెరుగు ఆవడలు తెచ్చాడు. బడి గురించి ఒక్కమాట ఎత్తలేదు. ఆ రోజు నుంచి నేనెప్పుడూ బడి మానలేదు. ●

'ఏమైందిరా? ఆకలిగా వుందా కుండలో అన్నం వుంది సట్టిలో చేపలకూర వుంది తిను" అంటూ బుజ్జగించాడు. వాడు బతిమాలుతుంటే నా ఏడుపు ఇంకా పెరిగింది. బయట ఎవరన్నా వింటారన్న ధ్యాసే లేదు. "ఊరుకోరా! ఊరుకో మధ్యాహ్నం బడికి పోదాంలే'! అంటూ సముదాయించసాగాడు బంగారయ్య.

## నీళ్ళు



మీనాక్షి: అదేమిటి మీ ఆయన పది నిమిషాలకు ఒకసారి నీ నెత్తిమీద నీళ్ళు చల్లుతున్నాడు.

కామాక్షి: నా నెత్తిమీద కాదు. నా తల్లో పూలమీద.

మీనాక్షి: నువ్వంటే మీ ఆయనకు ఎంత ప్రేమో! నీ తల్లో పూలు వాడిపోతాయని చక్కగా అలా నీళ్ళు జల్లుతూనే వుంటున్నాడు.

కామాక్షి: నా బొంద! అంత సీన్ లేదు. ఆయన పూలకొట్లో పనిచేస్తారు.